ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
బుధవారం 24 ఏప్రిల్ 2024



ఆక్రమణలు తొలగేనా..?

- రోడ్డును ఆక్రమించిన షెడ్ల కూల్చివేత
- ఒకే ఒక నిర్మాణాన్ని తొలగించిన సిబ్బంది
- పట్టణంలో వందల సంఖ్యలో ఆక్రమ నిర్మాణాలు
- మున్సిపల్ అధికారుల తీరుపై విమర్శలు
- ఆక్రమణలన్నిటినీ తొలగించాలని డిమాండ్



మార్కెట్ రోడ్డులో రోడ్డును అనుకొని వెలిసిన ఆక్రమ నిర్మాణాలు

మంచిర్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో రహదారుల ఆక్రమణల తొలగింపు ప్రక్రియపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యా దులు వచ్చినప్పుడో, రాజకీయ ఒత్తిళ్లతోనో షెడ్లను కూల్చివేయడం, ఆ తరువాత విస్మరించడం మున్సిపల్ అధికారులకు అలవాటుగా మారింది. కొన్నేళ్ళుగా ఈ తంతు జరుగుతుండగా అధికారుల అలసత్వం కారణంగా పట్టణంలో వందల సంఖ్యలో ఆక్రమ నిర్మాణాలు యేటా పుట్టుకొస్తున్నాయి. పట్టణంలో రోడ్ల పక్కన వెలిసిన టేలాలు, ఇతర ఆక్రమణల వెనుక ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, ఇతర నాయకుల ప్రమేయం ఉన్నదనే విషయం జగమెరిగిన సత్యం.



అర్చన టెక్స్ చౌరస్తాలో షెడ్ల కూల్చివేత

రూ. 20వేల వరకు కిరాయి వసూలు

పట్టణంలోని ప్రధాన రహదారుల పక్కన ఎక్కడ ఖాళీ జాగా ఉన్నా అక్కడ షెడ్లు ఏర్పాటు చేసి వాటిని చిరు వ్యాపారులకు అద్దెకు ఇవ్వడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఒక్కో ఆక్రమణకు నెలకు రూ.10 వేల నుంచి రూ.20వేల వరకు కిరా యిలు వసూలు చేస్తున్నారు. పాన్ టేలాలు, జ్యూస్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు జిల్లా కేంద్రంలోని అర్చన టెక్స్ చౌరస్తా, రైల్వే స్టేషన్ రోడ్డు, షిరిడీ సాయిబాబా రోడ్డులో డ్రైనేజీపై, జడ్పీ బాలుర ఉన్న త పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, ప్రభుత్వ ఐటీఐ కళాశాల, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రహరీలను ఆనుకొని పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి.

ఇదిలా ఉండగా ప్రముఖ షాపింగ్ మాల్స్ ముందు కూడా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తూ షెడ్లను నిర్మించి కిరాయికి ఇస్తూ వేలల్లో వసూలు చేస్తున్నారు. దీంతో రోడ్లు ఇరుకుగా మారి, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అయితే ఆయా నిర్మాణా ల వల్ల చిరు వ్యాపారులకు ఉపాధి లభిస్తుందన్న ఉద్దేశ్యంతో అధికారులు తొలగించేం దుకు వెనుకడుగు వేస్తున్నారు. దీనిని అలుసుగా తీసు కుంటూ రోజు రోజుకూ కొత్త టేలాలను నాయకుల అండదం డలతో ఏర్పాటు చేస్తూ వేలల్లో కిరాయిలు గుంజుతున్నా అడిగేవారు లేరు. మున్సిపాలిటీకి ఎలాంటి పన్ను చెల్లించకుండా నాయకులు టేలాలు ఏర్పాటు చేస్తుండగా కిరాయి రూపంలో చిరు వ్యాపారులకు విపరీతమైన భారం పడుతోంది.

కూల్చివేయడంలో పక్షపాత ధోరణి

మున్సిపాలిటీ పరిధిలోని రహదారి ఆక్రమణలపై అధికారులు కొరఢా ఝళిపిస్తు న్నారు. ఇందులో పక్షపాత ధోరణి అవ లంభిస్తుండ టంతో విమర్శలు వెల్లువెత్తు తున్నా యి. అంగబలం లేని వ్యక్తుల ఆక్రమణలను తొలగించడంలో ఉత్సాహం కనబరుస్తున్న అధికారులు, నాయకులు, ఇతర ప్రముఖుల వ్యక్తుల జోలికి వెళ్లడం లేదు. తాజాగా మంగళవారం అర్చన టెక్స్ చౌరస్తాలో ఓ వ్యాపారికి చెందిన ఆక్రమణ తొలగించడంలోనూ పక్షపాత ధోరణి అవలంభించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోడ్డుకు అడ్డంగా ఉన్నాయనే ఉద్దేశ్యంతో ఆక్రమణలను తొలగించిన అధికారులు, వాటిని ఆనుకొని పక్కనే ఉన్న ప్రముఖ వ్యాపారికి చెందిన నిర్మాణాలను ముట్టుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా పక్క పక్కనే ఉన్న ఆక్రమణల్లో కేవలం ఒకదానినే తొలగించడం అనుమానాలకు తావిస్తోంది. రహదారి ఆక్రమణలకు ఎవరు పాల్పడినా చట్ట విరుద్ధమే అయినప్పటికీ కొందరిపైనే ప్రతాపం చూపడంలో అధికారులు ఉత్సాహం కనబర్చడం విమర్శలకు దారి తీస్తోంది.

ఆక్రమణలన్నింటినీ తొలగిస్తాం
మారుతీ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్

మున్సిపాలిటీ పరిధిలో రహదారులను ఆక్రమిస్తూ వెలిసిన నిర్మాణాలను ఎలాంటి వివక్ష లేకుండా తొలగిస్తాం. అర్చన టెక్స్ చౌరస్తాలో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుండటంతో తప్పనిసరి పరిస్థితుల్లోనే షెడ్లను కూల్చివేశాం. షెడ్లను తొలగించాలని ముందస్తుగా నోటీసులు ఇచ్చిన తరువాతనే చర్యలు చేపడుతున్నాం. మిగతా కొన్ని చోట్ల కూడా నోటీసులు జారీ చేశాం. త్వరలో మిగిలిన వాటికి కూడా నోటీసులు జారీ చేసి, స్పందన లేనిపక్షంలో తొలగిస్తాం.

మరో 11 నామినేషన్లు దాఖలు

- 33కు చేరుకున్న అభ్యర్థుల సంఖ్య

పెద్దపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి (ఎస్సీ రిజర్వుడు) పార్లమెంటు స్థానానికి మంగళవారం మరో 11 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో ఇప్పటి వరకు అభ్యర్థుల సంఖ్య 33కు చేరుకున్నది. స్వతంత్ర అభ్యర్థులుగా దూడ మహిపాల్ (రెండో సెట్), తాళ్లపల్లి నరేష్, రాచర్ల రాజేశం, ఇరికిల్ల రాజేష్, కట్కూరి సందీప్ (రెండో సెట్), సోల్లు రంజిత్, యువతరం పార్టీ అభ్యర్థిగా చిలుక ఆనంద్, పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డెమోక్రటిక్) అభ్యర్థిగా మోతె నరేష్ (రెండో సెట్), అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ పార్టీ అభ్యర్థిగా అంబోజు సుమలత, బీఎస్పీ అభ్యర్థిగా ఇరుకుల్ల రాజ నర్సయ్య, సోషలిస్టు పార్టీ ఇండియా అభ్యర్థిగా ములకల కనకయ్య ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఇప్పటి వరకు ఐదు రోజుల్లో 33 మంది అభ్యర్థులు 42 సెట్లలో నామినేషన్‌లు దాఖలు చేసినట్లు పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు సమయం ఉంది. బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గోమాసే బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ షెడ్యూల్ ఖరారు

దండేపల్లి, ఏప్రిల్ 23 : లోక్‌సభ ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి షెడ్యూల్ ఖరారైంది. వీరికి మే 5 నుంచి 7వ తేదీ వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. 5న పీవోలు, ఏపీవోలు, సూక్ష్మ పరిశీలకులు నియోజకవర్గ కేంద్రాల్లో ఓటు వేసేలా ఏర్పాట్లు చేశారు. 6న ఏపీవోలు, 7న పోలీసు ఎన్నికల విధులు నిర్వహించే ఇతర శాఖల ఉద్యోగులు ఓటు వేయాలని నిర్ణయించారు. ఇతర జిల్లాల్లో ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.

నేల రాలిన మామిడి కాయలు

చెన్నూరు, ఏప్రిల్ 23: మండలంలో సోమవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు మామిడి కాయలు నేలరాయి. లంబాడిపల్లి, కన్నెపల్లి, సంకారం, బుద్దారం, కొమ్మెర, అంగ్రాజ్‌పల్లి, కిష్టంపేట, లింగంపల్లి తదిర గ్రామాల్లో ఈదురుగాలులు వీచాయి. మామిడి కొమ్మలు విరిగి పడ్డాయి. దీంతో మామిడి రైతులు నష్టపోయారు.

ఎంపీ ఎన్నికల్లో ఓట్లు వేయం

- రాజారం గ్రామస్థుల తీర్మానం
- గ్రామ సమస్యలు పట్టించుకోకపోవడమే కారణం

కోటపల్లి, ఏప్రిల్ 23: ఎన్నికలప్పుడే నాయకులు గ్రామానికి వచ్చి హామీలు ఇస్తారని, అనంతరం హామీలను నెరవేర్చడం లేదని మండలంలోని రాజారం గ్రామస్థులు వాపోయారు. అందుకే ఈసారి జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేయమని వారు తీర్మానించారు. దశాబ్దాలుగా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో గ్రామస్థులంతా మంగళవారం మామిడితోటలో సమావేశం ఏర్పాటు చేసుకుని ఓట్లు వేయవద్దని తీర్మానించారు. రాజారం గ్రామపంచాయతీలో రాజారం, కొత్తపల్లి రెండు గ్రామాలు ఉండగా సుమారు 952 మంది ఓటర్లు ఉన్నారు. గ్రామానికి రహదారి మంజూరైనా రిజర్వు ఫారెస్టు పేరుతో పనులను అర్థంతరంగా నిలిపివేశారు. దీంతో గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోగా ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాకాలంలో బాహ్య ప్రపంచంతో సంబంధాలు లేకుండా పోతాయని గ్రామస్థులు వాపోయారు. గ్రామంలో ప్రాథమిక విద్య అందుబాటులో ఉండగా హైస్కూలు విద్య కోసం 6 కిలో మీటర్ల దూరంలో ఉన్న దేవులవాడ ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం పాలైతే అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదని, అలాంటప్పుడు తాము ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. ప్రాణహిత, గోదావరి నదులు తలాపునే ప్రవహిస్తున్నా తాగు నీటి సౌకర్యం లేకుండా పోయిందన్నారు. ఓట్లకు వచ్చే నాయకులు హామీలు ఇస్తున్నారే కానీ సమస్యలు తీర్చడం లేదన్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఓట్లు వేయమని, ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు గ్రామస్థులు ప్రకటించారు.



ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు తీర్మానం కాపీని చూపెడుతున్న గ్రామస్థులు

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 23: పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఎన్నికల నిబంధనల ఉల్లంఘన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందని, జూన్ 6 వరకు ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల సంబంధిత ఫిర్యాదులకు కంట్రోల్ రూంతో పాటు సీ వీజిల్, టోల్‌ఫ్రీ నెంబరు 1950ను ఏర్పాటు చేశామని, ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కరించాలన్నారు. విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నోడల్ అధికారులు, ఎన్నికల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గూడెంలో పౌర్ణమి జాతర

దండేపల్లి, ఏప్రిల్ 23: గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం చైత్ర పౌర్ణమి జాతర జరిగింది. భక్తులు ఆలయ సమీపంలో గోదావరిలో పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం ఆలయానికి చేరుకొని సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, అన్నదానం నిర్వహించినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.



సత్యనారాయణస్వామి వ్రతం ఆచరిస్తున్న భక్తులు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏసీసీ, ఏప్రిల్ 23: మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాల 132కేవీ సబ్ స్టేషన్‌లో బుధవారం మరమ్మతు చేపట్టనున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకు ఏసీసీ, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా కైతల ఎన్నీలు

ఏసీసీ, ఏప్రిల్ 23: పట్టణంలోని గౌతమినగర్‌లో మంగళవారం పున్నమి కవుల కలయిక (కైతల ఎన్నీల) కార్యక్రమాన్ని నిర్వహించారు. తోకల రాజేశం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కవి రాజేశ్వర్‌రావు రచించిన అమ్మకు ఒక జత చెప్పులు కొనాలి అనే కవిత సంకలనాన్ని కవి నాగవర్మ ముఖ్యం సమీక్ష ప్రసంగం చేశారు. కవులు భూమన్న, అల్లాడి శ్రీనివాస్, శ్రీమన్నారాయణరెడ్డి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా హన్మాన్ శోభాయాత్ర



కిష్టంపేటలో హన్మాన్ ఆలయంలో భక్తుల పూజలు, మందమర్రిలో వెండి కిరీటం అందజేత, అలంకరణలో హన్మాన్ విగ్రహం



శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న కొక్కిరాల సురేఖ

ఏసీసీ, ఏప్రిల్ 23: జిల్లాలో హన్మాన్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శోభాయాత్రను వైభవంగా చేపట్టారు. విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలో నిర్వహించిన హనుమాన్ విజయ శోభాయాత్రలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పాల్గొన్నారు. మహిళలతో కలిసి కోలాటం ఆడారు. పట్టణాధ్యక్షుడు తూముల నరేష్, బ్లాక్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, జగన్, నటేశ్వర్, మున్నారాజాసిసోడియా పాల్గొన్నారు.

నస్పూర్: పట్టణంలోని అంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పూజలు జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దండేపల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో హనుమాన్ జయంతి వైభవంగా జరిగింది. అంజనేయస్వామికి చందనాభిషేక పూజలు, దీక్షాపరులు 108 సార్లు హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. దండేపల్లిలో హన్మాన్ భక్తుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మ్యాదరిపేటలో హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం, శోభయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

మందమర్రిటౌన్: పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లోని హనుమాన్ ఆలయంలో 108 కలశాలతో పూజలు చేశారు. పంచముఖి ఆంజనేయ స్వామిఆలయంలో హనుమాన్ దీక్షాపరులు పూజలు చేశారు. పాత బస్టాండ్ ఏరియాలోని హనుమాన్ ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు బండి సదానందం యాదవ్ దంపతులు పూజలు నిర్వహించారు. ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మార్కెట్ సెంటర్‌లో గల హనుమాన్ విగ్రహానికి స్థానిక వ్యాపారి గంప ఆంజనేయులు రూ.2 లక్షల విలువ గల వెండి కిరీటాన్ని అందజేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య హనుమాన్ విగ్రహానికి వెండి కిరీటాన్ని అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తమ్మిశెట్టి విజయ్, గడ్డం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి: కోటపల్లి, శెట్‌పల్లి, మల్లంపేట, పారుపెల్లి, దేవులవాడ, తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమలపాకులు, జిల్లేడుపూలదండలు, సింధూరంతో అలం కరించారు. అనంతరం ఆయా దేవాలయాల ప్రాంగణంలో అన్నదానం,ప్రసాదం పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు.

చెన్నూరు: కిష్టంపేట, ఓత్కులపల్లి, సుద్దాల, అంగ్రాజ్‌పల్లి, ఆస్నాద, పొక్కూరు, దుబ్బపల్లి, రాయిపేట, ఎర్రగుంటపల్లె, కొమ్మెర గ్రామాల్లో హనుమాన్ జయంతి నిర్వహించారు. ఆలయాల్లో హనుమాన్‌కు పూజలు నిర్వహించారు. అర్చకులు హనుమంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

భీమారం: మండల కేంద్రంలో హనుమాన్, రామాలయంతో పాటు వివిధ గ్రామాల్లో హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. హనుమాన్ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జన్నారం: మండలంలో హనుమాన్ జయంతి ఘనంగా జరిగింది. పైడిపల్లి ఆలయంలో శ్రీరామహోమం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీటీసీ మాదాడి సరోజన, జక్కు భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: హనుమాన్ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తంగళ్లపల్లి హనుమాన్ ఆలయం నుంచి ఐబీ కేంద్రం వరకు భక్తులు శోభాయాత్ర చేపట్టారు.

మందమర్రిరూరల్: మండలంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. హనుమాన్ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందుగులపేటలోని కోరగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారీ శర్మ, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.



దండేపల్లిలో హన్మాన్ దీక్షాపరుల బైక్ ర్యాలీ

నేటి నుంచి పాఠశాలలకు సెలవులు



బ్యాగులతో ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

దండేపల్లి, ఏప్రిల్ 23: ఈ విద్యా సంవత్సరం మంగళవారంతో ముగిసిం ది. వేసవి సెలవులు రావడంతో విద్యార్థులు ప్రోగ్రెస్ కార్డులు పట్టుకుని ఆనందంగా ఇంటిదారి పట్టారు. జూన్‌లో కలుద్దామంటూ స్నేహితులకు వీడ్కోలు పలికారు. పాఠశాలలకు బుధవారం 23 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు కావడంతో విద్యార్థులందరూ ఇళ్లకు తరలివెళ్లారు. సంవత్సర కాలం కలిసి మెలిసి ఉన్న స్నేహితులు 49 రోజుల పాటు వేసవి సెలవులు రావడంతో పాఠశాలలోని తోటి విద్యార్థులకు బై..బై అంటూ వీడ్కోలు చెప్పుకున్నారు. దండేపల్లిలోని కస్తూర్బా బాలికల ఆశ్రమ విద్యాలయం, ఎస్సీ, బీసీ వసతి గృహాలకు చెందిన విద్యార్థులు ఇళ్లకు పయనమయ్యారు.

విలువలతో కూడిన విద్య కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సెక్టోరల్ అధికారి

కోటపల్లి, ఏప్రిల్ 23: మార్కులు ర్యాంకులు ప్రధానమైనవి కావని, విలువలతో కూడిన విద్య అందినప్పుడే విద్యార్థికి భవిష్యత్ ఉంటుందని విద్యాశాఖ జిల్లా సెక్టోరల్ అధికారి సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. సెలవుల్లో విద్యార్థులు చేయాల్సిన కృత్యాలు, తల్లిదండ్రులు గమనించాల్సిన అంశాలపై వివరించారు. అనంతరం విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డులు అందించారు. ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఎస్పీ నాయకుడు



ముఖ్యమంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన దాసారపు శ్రీనివాస్

మందమర్రి టౌన్, ఏప్రిల్ 23: మందమర్రికి చెందిన బీఎస్పీ రాష్ట్ర నాయకులు, శ్రీవిద్య ఫౌండేషన్ అధ్యక్షుడు డా.దాసారపు శ్రీనివాస్ మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి సమక్షంలో ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ డాక్టర్ సెల్ విభాగానికి చైర్మన్‌గా పని చేసిన ఆయన చెన్నూరు ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. టికెట్ రాకపోవడంతో బీఎస్పీలో చేరారు. ఆయన మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సలహాదారు నరేందర్‌రెడ్డి ఉన్నారు.

గుండెపోటుతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మృతి



నాగయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బెల్లంపల్లి, ఏప్రిల్ 23: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తాటిపాముల నాగయ్య (70) గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. అస్వస్థతకు గురికావడంతో కుటుంబీకులు మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. నాగయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్ర సాధన కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. బాబుక్యాంప బస్తీలోని ఆయన నివాసంలో చెన్నూరు, మంచిర్యాల ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ, మాజీ ఎంఎల్‌సీ వెంకట్రావు, నాయకులు బండి ప్రభాకర్, నాతరి స్వామి, మల్లయ్య, సూరి బాబు, మల్లేష్, నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. నల్లం సంజీవరెడ్డి, చిప్ప మనోహర్, కౌన్సిలర్ నీలి కృష్ణ, కంకటి శ్రీనివాస్, రాజలింగు, సతీష్, అన్వర్‌ఖాన్, గౌస్, అమా సుల్లాఖాన్, వాజిద్, శ్రీనివాస్, శంకర్, చంద్రమౌళి, శ్రీధర్ తదితరులు నివాళులర్పించారు. పార్టీ కార్యాలయంలో నాగయ్య చిత్రపటానికి పూలమా లలువేసి నివాళులర్పించారు.



నాగయ్య పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గడ్డం వివేక్

మైనార్టీ గురుకుల వాచ్‌మన్ విధుల నుంచి తొలగింపు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 23: బెల్లంపల్లి మైనార్టీ గురుకుల పాఠశాల వాచ్‌మన్ ఎండీ నిహాల్‌ను టీఎంఆర్‌ఈఐఎస్ హైద్రాబాద్ కార్యదర్శి ఆదేశాల మేరకు విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో నెలకొన్న ఘటనపై వాచ్‌మన్‌ను విధుల నుంచి తొలగించడంతో పాటు ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసు జారీ చేశామని తెలిపారు

పాఠశాలలను సందర్శించిన ఎంపీడీవో

భీమారం, ఏప్రిల్ 23 : మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం ఎంపీడీవో రాథోడ్ రాధ సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేయడానికి ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలను నెలకొల్పిందన్నారు. పాఠశాలలకు 25 శాతం నిధులను మంజూరు చేసి కేటాయించిన పనుల స్థాయిని బట్టి మిగితా 75 శాతం మంజూరు చేస్తామన్నారు. పాఠశాలలు పునః ప్రారంభమ య్యేలోగా పనులను పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యదర్శులు, వీవోలు, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

హత్య చేసి.. మృతదేహం దహనం

మల్యాల, ఏప్రిల్ 23: మండలంలోని రాజారం శివారులో గల ఎస్సారెస్పీ కెనాల్ వద్ద ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. మల్యాల ఎస్సై అబ్దుల్ రహీం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామన్నపేటకు చెందిన ముస్కు మహిపాల్‌రెడ్డి(35)అనే యువకుడు చికెన్ సెంట ర్‌లలో దినసరి కూలిగా పని చేస్తుంటాడు. సోమవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిన మహిపాల్ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పలు చోట్ల గాలించారు. మంగళవారం రాజారం ఎస్సారెస్పీ కెనాల్ వద్ద అతని మృతదేహం అనుమానాస్పద స్థితిలో కనిపించింది. గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఆనవాళ్లు గుర్తు పట్టకుండా దహనం చేయడంతో పాటు మృతదేహంపై అరటి పళ్ల డబ్బాలు పెట్టారు. మృతదేహాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాల వేలం

లక్సెట్టిపేటరూరల్, ఏప్రిల్ 23: వివిధ ఎక్సైజ్ కేసుల్లో జప్తు చేసిన పలు ద్విచక్రవాహనాలకు ఈ నెల 25న లక్సెట్టిపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు వేలం నిర్వహి స్తామని ఇన్‌స్పెక్టర్ నర్సింహులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

ఉచిత బాక్సింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

ఏసీసీ, ఏప్రిల్ 23 : జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా బాక్సింగ్ కేంద్రంలో ఉచిత బాక్సింగ్ శిక్షణకు దరఖా స్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కీర్తి రాజ్ వీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 నుంచి 20 సంవ త్సరాల మధ్య వయస్సు గల బాల బాలికలు జడ్పీ బాలుర పాఠశా లలో లేదా కోచ్ రాజేష్ 9963539234లో సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

వేమనపల్లి, ఏప్రిల్ 23 : పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణను గెలిపించాలని ఎంపీటీసీ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం వేమనపల్లిలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమా వేశంలో బెల్లంపల్లి ఎన్నికల ఇన్‌చార్జి వెంకటగిరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీఆర్ ఆలీతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలందరికి వివరించాలన్నారు. నాయకులు, మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

భీమారం, ఏప్రిల్ 23: ప్రభుత్వం మహాలక్ష్మీ పథకం ప్రారంభించ డంతో ఆటో డ్రైవర్ల బతుకులు రోడ్డున పడ్డాయని, ప్రభుత్వం ఆదుకోవాలని మండల ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పక్రోద్దీన్ కోరారు. మంగళవారం బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయా ణంతో ఆటోలకు గిరాకీ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న నీరు

కాసిపేట, ఏప్రిల్ 23: మండలంలోని ముత్యంపల్లి గ్రామంలో నీరు వృథాగా పోతోంది. ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట పైపులైన్ పగల డంతో నీరు ఎగిసి పడుతోంది. రెండు రోజుల అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. వెంటనే పైపులైన్‌కు మరమ్మతు చేయించాలని పలువురు కోరుతున్నారు.

బీఎస్పీ స్టార్ కాంపెయినర్‌గా రవీందర్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 23: పార్లమెంట్ ఎన్నికలకు బీఎస్పీ పక్షాన స్టార్ కాంపెయినర్‌గా శ్రీరాంపూర్ చెందిన కాదాసి రవీందర్‌ను నియ మించినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ ఒక ప్రకట నలో తెలిపారు. రవీందర్ బీఎస్పీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజక వర్గ ఇన్‌చార్జిగా వ్యవహ రిస్తున్నట్లు పేర్కొన్నారు. రవీందర్ మాట్లాడు తూ, తనకు అప్పగించిన బాధ్యతను నెరవేరుస్తానని, పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని అన్నారు.

ఆర్థిక సహాయం

భీమారం, ఏప్రిల్ 23: కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎంగిలి మధు నయ్య ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబానికి మంగళవారం సోపతి సొసైటీ సభ్యులు రూ.2 వేలు, ఫ్రెండ్స్ సొసైటీ సభ్యులు రూ. 8 వేల ఆర్థిక సహాయం అందించారు. గుండు తిరుపతి, పోడేటి రవి, రాజ్‌కుమార్ నాయక్, అశోక్,లింగయ్య,మహేష్, రాజం పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

దండేపల్లి, ఏప్రిల్ 23: వేసవికాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడుతాయని రాచ రాజన్న, శ్రీధర్‌లు అన్నారు. మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం సమీపంలో రాచ రుక్కమ్మ రాజలింగయ్య దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

ఏసీసీ, ఏప్రిల్ 23: మంచిర్యాల పట్టణంలోని శ్రీశ్రీనగర్‌కు చెందిన కాజీపేట శ్రీనివాస్ (52) ప్రభుత్వ ఉపాధ్యాయుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. సోమవారం రాత్రి కుమారుడిని మంచిర్యాల బస్టాండ్‌లో దింపేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా రాత్రి 12.30 గంటల సమయంలో ఓవర్ బ్రిడ్జి దిగుతుండగా సీసీసీ నస్పూర్ నుంచి మంచిర్యాల వైపు వస్తున్న కారు వేగంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబీకులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచనల మేరకు కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. మృతుడు మంథని మండలం చందనాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారని తెలిపారు. భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

దేశీదారు తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు

ఏసీసీ, ఏప్రిల్ 23 : మహారాష్ట్ర చంద్రపూర్ నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని సిరొంచకు అక్రమంగా దేశీదారు తరలిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. అండమాన్ రైలులో 9 కాటన్‌ల దేశీదారు బాటిళ్లను మంచిర్యాలకు తీసుకుని వచ్చి రైలు దిగి అనుమానాస్పదంగా కనిపించగా వారిని విచారించగా నిందితులు నేరం ఒప్పుకున్నారన్నారు. చంద్రపూర్‌లో ఒక్కో కాటన్‌ను రూ 3,500లకు కొనుగోలు చేసి సిరొంచలో రూ.5 వేలకు అమ్మడానికి తరలిస్తున్నట్లు తెలిపారు. కొమ్మరి తిరుమల్, జాడి రాజేష్, రాజడి రాహుల్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ. 31,500 విలువ దేశీదారును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తుల రిమాండ్

తాండూర్, ఏప్రిల్ 23: తాండూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులకు ఆటంకం కలిగించిన ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ జగదీష్‌గౌడ్ మంగళవారం తెలిపారు. శనివారం పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఆటోను పట్టుకొని స్టేషన్‌కు తరలించామన్నారు. ఆటో, బియ్యానికి సంబంధించిన వ్యక్తులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి గొడవ పడి విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా పోలీసులను దూషించారన్నారు. విధులకు ఆటంకం కలిగించిన ఫర్జానాబేగం, అమీనాబేగం, టీనాబేగం, ముకదుం, మోసిన్, యూసఫ్, నరేష్‌లను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మొక్కజొన్న పంట దహనం

జన్నారం, ఏప్రిల్ 23: చింతలపల్లి పంచాయతీ పరిధిలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన శంకర్ల రాజన్న, గంగాధర్‌లకు చెందిన మూడెకరాల మొక్కజొన్న పంటకు మంగళవారం మంటలు అంటుకున్నాయి. మంటలను గమనించిన జాడి శివ ఫైర్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఫైర్ అధికారి లక్ష్మీనారాయణ, పోలీసులు చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే లక్ష రూపాయల పంట నష్టం జరగగా, మరో రూ. 1.30 లక్షల పంటను కాపాడినట్లు తెలిపారు. ఏ విధంగా నిప్పంటుకుందో విచారణ చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితులకు జరిమానా

భీమిని, ఏప్రిల్ 23: హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులకు కోర్టు మంగళవారం జరిమానా విధించినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని అక్కలపల్లికి చెందిన చాపెడి మనోజ్‌ను అదే గ్రామానికి చెందిన చాపెడి విజయ్‌కుమార్ అతని భార్య కమలతో మనోజ్‌కు వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో విజయ్ కుమార్, కమల, చాపెడి రాజ్‌కుమార్‌లు 2020 జనవరి 10న అక్కలపల్లి గ్రామం నుంచి కిష్టాపూర్ ఎడ్ల బండిపై తిరిగి వస్తున్న క్రమంలో చాపెడి మనోజ్‌పై గొడ్డలితో దాడి చేసినట్లు చెప్పారు. మనోజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు విచారణ జరిపి చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితులు చాపెడి విజయ్‌కుమార్ అతని భార్య కమల, తమ్ముడు చాపెడి రాజ్‌కుమార్‌లకు ఒక్కొకరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారని మంచిర్యాల అదనపు సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్ జడ్జి అర్పిత రెడ్డి మంగళవారం తీర్పు చెప్పారన్నారు.

మద్దిమాడ పోలీసు కాల్పులకు 36 ఏండ్లు

- ● నేటికీ నెరవేరని హామీలు
- ● అభివృద్ధికి నోచుకోని గ్రామాలు

కాసిపేట, ఏప్రిల్ 23: కాసిపేట మండలం మద్దిమాడలో 36 ఏండ్ల క్రితం జరిగిన పోలీసు కాల్పుల ఘటన ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు. 1988లో తెలుగుదేశం పార్టీ గిరిజనుల సొంతింటి నిర్మాణానికి అవకాశం కల్పించింది. స్థానిక గిరిజనులు సమీప అడవి నుంచి కర్రను తెచ్చుకుని ఇండ్ల నిర్మాణాలు చేపట్టే క్రమంలో 1988 ఏప్రిల్ 24వ తేదీన జరిగిన కాల్పుల ఘటనలో పోలీసు తూటాలకు ఒకరు బలి కాగా ఏడుగురు గాయాలపాలయ్యారు. పోలీసు కాల్పుల్లో మృతి చెందిన చేనేని భీమయ్య వర్ధంతిని నాయకపోడ్‌లు యేటా ఆయన వర్ధంతిని నిర్వహిస్తున్నారు.

● ఏండ్లు గడిచినా మారని తీరు

చాలా మంది గిరిజనులు నేటికీ పెంకుటిండ్లలోనే కాలం వెళ్లదీస్తున్నారు. విద్య, ఉపాధి, ఉద్యోగాలు, సాగుభూములు ఇస్తామని హామీ ఇచ్చిన అధికారులు పట్టించుకోవడం లేదని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. మద్దిమాడ గ్రామస్థులపై పోలీసులు విచక్షణ రహితంగా జరిపిన కాల్పుల్లో భీమయ్య మృతి చెందగా చెడ్మకి భీము, మడావి జైతు, చెడ్మకి కొద్దు, కోట్నాక మారు, శంకర్, మడావి మారుబాయి, పెద్దులు తీవ్ర గాయాలపాలయ్యారు. సంఘటన స్థలాన్ని అప్పటి కలెక్టర్ పీవీకే శర్మ, ఉట్నూరు ఐటీడీఏ పీవో సుబ్రమణ్యంలు సందర్శించారు. గ్రామాల అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. అవి నేటికి అమలు కాలేదు. రోడ్లు, ఇతర సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతు న్నారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్క రించాలని కోరుతున్నారు.


కాల్పుల్లో మృతిచెందిన చేనేని భీమయ్య విగ్రహం

ప్రభుత్వ పరంగా ఆదుకోవాలి

- చెడ్మకి కొద్దు, బాధితుడు



పోలీసుకాల్పుల్లో భుజంలో తూటా దిగింది. ప్రాణభయంతో అడవిలోకి పారిపోయాను. గాయం మానేందుకు రెండేండ్లు పట్టింది. ఆదుకుంటామని చెప్పిన అధికారులు ఎవరు పట్టించుకోలేదు. అనేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

హామీలన్నీ మర్చిపోయింద్రు

- రొడ్డ రమేష్, మద్దిమాడ



సంఘటన తర్వాత అధికారులు వచ్చి బాధిత కుటుంబాలకు సాగు భూములు, ఎడ్లు, యువతకు ఉద్యోగాలు, మినీ సాగునీటి ప్రాజెక్టు నిర్మించి వ్యవసాయం అభివృద్ధి చేస్తామని చెప్పారు. హామీలు నెరవేర్చలేదు. ప్రభుత్వాలు మారుతున్నా మా జీవితాల్లో మార్పు లేదు.

బీజేపీతోనే పేదల సంక్షేమం


ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

దండేపల్లి, ఏప్రిల్ 23: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, ఉపాధిహామీ కూలీల వేతనాన్ని ప్రధాని నరేంద్రమోదీ పెంచారని పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరవెల్లి రఘునాథ్ అన్నారు. మంగళవారం కొండాపూర్‌లో పార్టీ శ్రేణులతో కలిసి కూలీలు పని చేసే ప్రదేశానికి వెళ్లి మాట్లాడారు. ధర్మరావుపేటలోని కరపత్రాలతో ఇంటింటికి వెళ్లి పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేను గెలిపించాలని కోరారు. బీజేపీ పాలనలోనే దేశంలో సమగ్రాభివృద్ధి సాధ్యమైందన్నారు. గోపతి రాజయ్య, ప్రభాకర్, సురేష్, గురువయ్య, పాల్గొన్నారు.

గడ్డం వంశీకృష్ణకు సన్మానం


పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిని సన్మానిస్తున్న నాయకులు

మందమర్రి టౌన్, ఏప్రిల్ 23: పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను ఆదిజాంబవ సంఘం నాయకులు మంగళవారం సన్మానించారు. ఎన్నికల్లో తమ సంఘం కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రచారం చేస్తుందని తెలిపారు. అధ్యక్షుడు శంకర్, ఎల్లారం, రాయనర్సు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కులను కాలరాస్తున్న అధికారులు


మాట్లాడుతున్న తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిందర్

మందమర్రి టౌన్, ఏప్రిల్ 23: మందమర్రిలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూ కబ్జాదారులు ఆదివాసీ హక్కులను కాలరాస్తున్నారని తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిందర్ ఆరోపించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 117 చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారన్నారు. ఇక్కడ గిరిజన భూములకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నం. 385లో గల భూమిని కొందరు కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రియల్ వ్యాపారులు గిరిజన భూములను ఆధారంగా చేసుకొని కోట్లకు పడగలెత్తారని, కాని భూమి హక్కుదారులకు ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. అధికారులు గిరిజనుల చట్టాన్ని దృష్టిలో పెట్టుకొని భూముల హక్కుదారులకు న్యాయం చేయాలన్నారు. సత్యనారాయణ, వెంకటి, రాంబాబు, రాజేశ్వర్‌రెడ్డి, కూన తిరుపతి, కూన గోపాల్‌లు పాల్గొన్నారు.

ఆదరించండి అభివృద్ధి చేస్తా



చెన్నూరు, ఏప్రిల్ 23: పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని పెద్దపల్లి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కోరారు. మంగళవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి చెన్నూరు పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీల మోసపూరిత మాటలను నమ్మి ఎవరు మోసపోవద్దన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


ఫేర్‌వెల్ పార్టీలో పాల్గొన్న విద్యార్థులు

ఏసీసీ, ఏప్రిల్ 23: మంచిర్యాల పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులు ఫేర్‌వెల్ పార్టీని మంగళవారం ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో ఘనంగా నిర్వహించారు. కాకతీయ యూనివర్శిటీ ఫలితాల్లో 1, 3, 5 సెమిస్టర్‌లలో జీపీఏ గ్రేడ్‌లు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల కరస్పాండెంట్ మల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్ప రుచుకుని వాటిని సాధించేందుకు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలన్నారు. కళాశాల డైరెక్టర్‌లు, ప్రిన్సి పాల్, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని మిమ్స్ డిగ్రీ కళాశాల ఫేర్‌వెల్ పార్టీని ప్రైవేటు హాలులో ఘనంగా నిర్వహించారు. యూనివర్శిటీ స్థాయిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు చేసి అలరించారు. కరస్పాండెంట్ శ్రీనివాసరాజు, ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి , అధ్యాపకులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మరింత విజ్ఞానం


బేహరన్‌గూడలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం

దండేపల్లి, ఏప్రిల్ 23: పుస్తక పఠనంతో విద్యార్థులు మరింత విజ్ఞానం పొందవచ్చని లక్సెట్టిపేట ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గఫార్ అన్నారు. తాని మడుగు జీపీ పరిధిలోని బేహరన్‌గూడలో సావిత్రి బాయిఫూలే గ్రంథాలయాన్ని గ్రామ పటేల్, గిరిజనులతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు గ్రంథాలయం ఎంతో ఉపయో గమనిన్నారు. గిరిజన విద్యార్థులు వేసవి సెలవుల్లో గ్రంథాలయం ఉపయోగించుకొని విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కోటపల్లి: ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరిం చుకుని బావనపల్లి ప్రాథమిక పాఠశాలలో పుస్తక ప్రద ర్శన నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు బొలిశెట్టి బుచ్చన్న పుస్తకాల ప్రాముఖ్యతను వివరిస్తూ ఒక మంచి పుస్తకం వంద మంది మిత్రులతో సమానమని విద్యార్థులకు తెలిపారు. చిన్న నాటి నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

పనులను ప్రారంభించిన ఎంపీడీవో

జైపూర్, ఏప్రిల్ 23 : మండలంలోని ముదిగుంట, కాన్కూర్ ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులను మంగళవారం ఎంపీడీవో సత్యనారాయణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అమ్మఆదర్శ కమిటీల్లో భాగంగా పాఠశాలల్లో చేపడుతున్న పనులను మే నెల చివరి వరకు పూర్తి చేయాలని మండల సమాఖ్య ప్రతినిధులకు సూచించారు. మండల వ్యాప్తంగా 19 గ్రామాల్లోని 23 పాఠశాలలకు రూ. 89 లక్షల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాజ్‌కుమార్, పీఆర్ఏఈ రవి, వీవోఏల సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 23: ఆసిఫాబాద్ మండలంలోని గుండి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఈసీసీఈ డే సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సొంబాయి గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. పిల్లలకు ఆటలు, కథలు, సంభాషణ శాస్త్రీయ పరిజ్ఞానం, ప్రీ స్కూల్ విద్య ప్రాముఖ్యత బాలరంబ దశ, తదితరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ల పెంటుబాయి, విజయలక్ష్మి, ఆశా వర్కర్లు దేవిక, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించాలి

పెంచికలపేట, ఏప్రిల్ 23: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ కోరారు. పెంచికలపేట మండలం దర్గపల్లి గ్రామంలో ఆయన కార్యకర్తలతో కలిసి మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణక్కను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి, మాజీ స ర్పంచ్ సంజీవ్, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్ కోరారు. మండలంలోని గౌరి, కొలాంగూడ తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముకీద్, మాజీ వైస్‌ఎంపీపీ షేక్ రషీద్ మాట్లాడారు. ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేసిన ఉద్యమ నాయకురాలు ఆత్రం సుగుణను ఆదరించి గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆత్రం గుండ, ఆత్రం అన్నిగ, సిడాం, సిడాం మారు, మేస్రాం షేకు పటేల్, మేస్రాం జల్పత్, పెందుర్ ప్రకాష్ పాల్గొన్నారు

చోరీ కేసులో ఒకరి రిమాండ్

కౌటాల, ఏప్రిల్ 23: మండలంలోని బోదంపల్లి గ్రామంలో గల మధున పోచమ్మ ఆలయంలో ఈ నెల 16వ తేదీన చోరీకి పాల్పడిన వ్యక్తిని పట్టుకుని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు గుడి తాళం పగలగొట్టి గుడిలోని హుండిలో గల డబ్బులను ఎత్తుకెళ్లారు. ఆలయ పూజారి పర్దాని పోచయ్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం వాహనాల తనిఖీలో భాగంగా బోదంపల్లి గ్రామానికి చెందిన గుర్లె శ్రీకాంత్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని అదపులోకి తీసుకుని విచారించగా ఇటీవలబోదంపల్లి గ్రామంలో గల మధున పోచమ్మ ఆలయంలో దొంగతనం చేశానని ఒప్పుకున్నాడు. అతని వద్ద దొంగలించిన నగదు రికవరీ చేసి మంగళవారం రిమాండ్‌కు పంపామని ఎస్సై తెలిపారు.

పెరిగిన పోలింగ్ కేంద్రాలు

సిర్పూర్(టి), ఏప్రిల్ 23: మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 23 వేల ఓటర్లు ఉండగా నూతనంగా నాలుగు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం అధికారులు పెంచారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 29 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.ఈ సారి పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మరో నాలుగు పోలింగ్ కేంద్రా లను పెంచారు. మండలంలోని కేశవపట్నం, టోంకిని, పూసుగూడ, ఇటిక్యాల పహాడ్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని అధికారులు వెల్లడించారు.

రహదారిపై సంత.. ప్రయాణికుల చింత


సలుగుపల్లిలో ప్రధాన రహదారిపై నిర్వహిస్తున్న సంత

బెజ్జూరు, ఏప్రిల్ 23: మండలంలోని సలుగుపల్లిలో ప్రతీ గురువారం నిర్వహించే సంత ప్రధానరహదారిపై నిర్వహి స్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. సలుగుపల్లి-చింతలమానేపల్లి మధ్య రోడ్డుకు ఇరు వైపులా కూరగాయలు విక్రయిస్తుండటం, భారీ వాహనాలు వచ్చినప్పుడు, ద్విచక్రవాహనాలు, బస్సులు, ఆటోలు వెళ్లా లంటే నానా అవస్థలు పడుతున్నారు. సంతలో వేలాది రూపాయల లావాదేవీలు జరుగుతుంటాయి. కానీ కొనుగోలు చేసేందుకు వచ్చే సామాన్యులకు మాత్రం కనీస సౌకర్యాలు ఉండవు. ప్రతి గురువారం జరిగే సంతకు మండలంలోని వివిధ గ్రామాల నుంచే కాకుండా కౌటాల, చింతలమానేపల్లి, సిర్పూర్(టి), కాగజ్‌నగర్ తదితర గ్రామాల నుంచి వ్యాపారులు వచ్చి వివిధ రకాల సామాగ్రి, కూరగాయలు, వంటపాత్రలు, బట్టలు తదిత రాలు విక్రయిస్తుంటారు. వాటిని కొనుగోలు చేయడానికి ప్రజలు వస్తుంటారు.

- వసతులు లేక అగచాట్లు..

కూరగాయలు విక్రయించేందుకు సంతకు వచ్చిన వ్యాపారులు రోడ్డుపై నడిచే వాహనాలతో ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక వారు నిలువ నీడ లేక ఎండలో కూర్చొని వ్యాపారాలు సాగిస్తున్నారు. సంతకు వచ్చే మహిళలకు కనీసం మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. అదేవిధంగా ఇదే మార్గం గుండా బారేగూడ మీదుగా బస్సులు సైతం వెళ్తుంటాయి. ఈ క్రమంలో రోడ్డుపై సంత క్రయవిక్రయ దారులతో నిత్యం రద్దీగా ఉన్న సమయంలో బస్సు దాటడం కూడా కష్టతరంగా మారింది. ఎన్నో ఏళ్లుగా ఈ పరిస్థితి మారడం లేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా రహదారి.. ప్రయాణికుల ఇబ్బందులు


ప్రమాదకరంగా ఉన్న గుంత

సిర్పూర్(టి), ఏప్రిల్ 23: మండల కేంద్రం నుంచి అంతరాష్ట్ర మహారాష్ట్రకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదు. మాకిడి, హుడ్కిలి, రోడ్డు గుండా నిత్యం వందల సంఖ్యలో లారీలు, వాహనాలు నడుస్తున్నాయి. దీంతో ఈ రహదారిపై ఏ క్షణం ప్రమాదం చోటు చేసుకుంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న గుంత, కల్వర్టు బుంగను పూడ్చాలని కోరారు.

బీమా చెక్కు అందజేత

వాంకిడి, ఏప్రిల్ 23: మండలంలోని సోనాపూర్ గ్రామానికి చెందిన మడావి విజయ ఇటీవల మృతి చెందగా ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి పథకం కింద తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుంచి రూ.2 లక్షలు మంజూరు కాగా నామినిగా ఉన్న మృతురాలి తండ్రి జలపతికి మేనేజర్ విష్ణువర్ధన్ మంగళవారం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఏ రవికుమార్, అకౌంటెంట్ అనిల్, క్యాషియర్ వాగు, సీఎస్పీ ప్రతినిధి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

కెరమెరి, ఏప్రిల్ 23: కెరమెరి మండలంలోని ముక్దాంగూడలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సులు లేక గ్రామీణుల అవస్థలు

- పట్టించుకోని అధికారులు

లింగాపూర్, ఏప్రిల్ 23: లింగాపూర్, సిర్పూర్(యు)మండలాల పరిధిలో పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు లేక పోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇటీవల కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. కాగా ఆయా గ్రామాలకు బస్సులు లేక పోవడంతో మహిళలకు ఉపయోగం లేకుం డా పోయింది. ఈ ప్రాంత ప్రజలు నిత్యం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమి త్తం రాకపోకలు సాగిస్తుంటారు. కాగా బస్సులు లేక పోవడంతో ఆటోలు, ఇతర వాహనాల్లో డబ్బులు చెల్లించి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఆర్టీసీ ఉన్నతా ధికారులు స్పందించి ఆసిఫాబాద్, ఆదిలాబాద్‌కు వెళ్లేందుకు మండలం నుంచి బస్సులు రాకపోకలు సాగిం చేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


బస్సులు లేక ఆటోలో ప్రయాణిస్తున్న మహిళలు

కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్, ఏప్రిల్ 23: అధికారంలో ఉన్న సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి వివరించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని కాలేజీగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని తెలిపారు. కార్యక్రమంలో మండల సహకార చైర్మన్ కొడప హన్నుపటేల్, పార్టీ మండల అధ్యక్షుడు ఇంతీయాజ్‌లాల, మాజీ చైర్మన్ కనక యాదవ్‌రావ్, వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, మాజీ సర్పంచులు మేస్రాం లక్ష్మణ్, మేస్రాం రాహుల్, మడావి భీంరావ్, నాయకుడు ఆత్రం లక్ష్మణ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాల చెల్లింపులో సిబ్బంది జాప్యం

- ఉపాధిహామీ కూలీల ఆగ్రహం


జైనూరు పోస్టాఫీసులో వేచి ఉన్న ఉపాధిహామీ కూలీలు

జైనూర్ , ఏప్రిల్ 23: వేతనాల చెల్లింపులో పోస్టల్ సిబ్బంది జాప్యం చేస్తున్నారని ఉపాధి హామీ కూలీల ఆగ్రహం వ్యక్తం చేశారు. జైనూరు, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల కూలీలు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కొంత కాలంగా ఉపాధిహామీ పనులకు సిబ్బందించిన వేతనాలు పోస్టాఫీసులో తీసుకుంటున్నామని చెప్పారు. పోస్టల్ కార్యాలయానికి డబ్బుల కోసం వెళ్లినప్పుడు సంబంధిత సిబ్బంది తీవ్ర జాప్యం చేస్తున్నారని వాపోయారు. తాము ఇంటికి అవసరమైన సామగ్రి కొనుగోలు చేసెందుకు జైనూరుకు రావాల్సి వస్తుందని చెప్పారు. ఈ క్రమంలో ఇక్కడ ఉన్న పోస్టాఫీసులో డబ్బుల కోసం వెళ్లినప్పుడు సిబ్బంది రాలేదని సమాధానం ఇస్తున్నారని తెలిపారు. పోస్టల్ ఖాతాలో కూలీ డబ్బులు జమ అయినప్పటికీ కావాలని సిబ్బంది వేతనాల చెల్లింపునకు జాప్యం చేస్తున్నారని వాపోయారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

బెజ్జూరు, ఏప్రిల్ 23: విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని ప్రధానోపాధ్యాయురాలు ఆదిత్యారాణి అన్నారు. బెజ్జూరు మండలంలోని ఎల్కపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటా పాటలతో హంగామా చేశారు. ప్రధానోపాధ్యాయురాలు ఆదిత్యారాణి, ఉపాధ్యాయులు వినోద్ ఆధ్వర్యంలో పాఠశాలలో వీడ్కోలు పార్టీ ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం చేరుకునేందుకు క్రమశిక్షణతో చదవాలని సూచించారు.



కొలువే లక్ష్యం

కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమన్న స్ఫూర్తిగా తమ కొలువుల కల సాకారానికి యువత తీవ్రంగా శ్రమిస్తోంది. జిల్లాలో ఏ గ్రంథాలయంలో చూసినా పెద్ద సంఖ్యలో యువకులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. అధికారులు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటుండడంతో పాటు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచడంపై అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జిల్లా గ్రంథాలయంలో చదువుకుంటున్న అభ్యర్థులు

- గ్రంథాలయాల బాట పడుతున్న యువత
- ప్రభుత్వ ఉద్యోగాల కోసం కఠోర శ్రమ
- ఆత్మవిశ్వాసంతో రోజూ గంటల తరబడి పుస్తకాలతో కుస్తీ
- సౌకర్యాల కల్పనకు అధికారుల చర్యలు

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 23: ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు వెలువడిన నేపథ్యంలో యువతీ యువకులు నిద్రాహారాలు మానేసి చదువుతున్నారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం యువతతో కిటకిట లాడుతోంది. పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి చాలా పుస్తకాలు అవ సరమవుతాయి. అన్ని కొనుక్కునే స్థోమత కొందరికి ఉండదు. అలాంటి వారు గ్రంథాలయాల్లోని పుస్తకాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఉదయం 6 గంటలకే గ్రంథాలయాలకు యువత చేరుకుంటున్నారు. ఇటీవల గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, హస్టల్ వార్డెన్, డీఎస్సీ ఉద్యోగాల ప్రకటన, టెట్ పరీక్ష నేపథ్యంలో ప్రతీ రోజు 100 నుంచి 150 మందికి పైగా యువతీ యువకులు వస్తున్నట్లు గ్రంథాలయ నిర్వహకులు తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధవుతు న్నవారి కోసం ప్రత్యేకంగా రీడింగ్ హాలు, కుర్చీలు, ప్యాడ్, ఆర్వో ప్లాంట్, ఏసీ వంటి సౌకర్యాలను కల్పించారు. అలాగే ఆన్‌లైన్‌లో పాఠాలు వినేందుకు ఇటీవల వైఫై సౌకర్యం కల్పిం చినట్లు అధికారులు తెలిపారు.

అందుబాటులో పుస్తకాలు..

జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో పోటీ పరీక్షలు, ఇతర పుస్తకాలు 17,600 అందుబాటులో ఉన్నాయి. ఇందులో తెలుగు-7300, ఇంగ్లీష్- 6500, హిందీ-3400, ఉర్దూ-420 పుస్తకాలు ఉన్నాయి. గ్రూప్-1, గ్రూప్- 2, గ్రూప్-3, డీఎస్సీ తదితర ఉద్యోగాలకు సంబంధించిన పుస్తకాలు, టెట్ పరీక్ష పుస్తకాలు ఉన్నాయి. ఒక వేళ ఏవైనా పుస్తకాలు అందుబాటులో లేని పక్షంలో పాఠకుల కోరిక మేరకు వారం రోజుల్లో సంబంధిత పుస్తకాలను గ్రంథాలయ అధికారులు సమకూరుస్తున్నారు. గతంలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకే గ్రంథాలయ పని వేళలు ఉండేవి. ప్రస్తుతం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు గ్రంథాలయాన్ని తెరిచి ఉంచుతున్నారు. ప్రభుత్వ సెలవుల్లో సైతం తెరిచి ఉంచుతున్నారు.

సౌకర్యాలు బాగున్నాయి..

మౌనిక, ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో సౌకర్యాలు బాగున్నాయి. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. డీఎస్సీ కోసం ప్రిపేర్ అవుతున్నాను. ప్రతి రోజూ గ్రంథాలయానికి వచ్చి చదువు కోవడమే పనిగా పెట్టుకున్నాను. తల్లిదండ్రుల ఆకాంక్షను నెరవేర్చేం దుకు కష్టపడి చదువుతున్నాను.

మెటీరియల్ అందుబాటులో ఉన్నాయి:

సంతోష్, ఆసిఫాబాద్



పోటీ పరీక్షలకు సంబందించిన మెటీరియల్ అందుబాటులో ఉన్నాయి. ఏవైనా అందుబాటులో లేని పక్షంలో సంబంధిత అధికారులకు తెలియజేస్తే సమకూరుస్తున్నారు. గ్రంథాలయంలో విద్యుత్ సమస్య ఉంది. కరెంట్ లేని సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు ఇన్వర్టర్ సమకూరిస్తే బాగుంటుంది.

సౌకర్యాలు కల్పిస్తున్నాం..

ముమ్మడి వెంకటరమణ, లైబ్రేరియన్, ఆసిఫాబాద్



పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం గ్రంథాలయంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఏసీ, కూలర్లు, ఆర్వో ప్లాంట్ ద్వారా నీటిని అందిస్తున్నాం. పోటీ పరీక్షలకు సంబంధించి అన్ని పుస్తకాలను అందు బాటులో ఉంచాం. ఏవైనా అందుబాటులో లేని పక్షంలో వారం రోజుల్లో సమకూరుస్తున్నాం.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఏప్రిల్ 23: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంటేష్ దోత్రే అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ మినీ సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో సాగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని తెలిపారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా వచ్చిన దరఖాస్తులను పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఈ నెల 25 తరువాత ఓటర్ల తుది జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు. హోం ఓటింగ్ కోసం శారీరక వైకల్యం కలిగిన ఓటర్లు, 85 సంవత్సరాలు దాటిన వృద్ధులు, ఫారం-12 డి దరఖాస్తులు బూత్ లెవల్ అధికారికి అందజేయాలని చెప్పారు. పలు రాజకీయ పార్టీలు బూఠత్ లెవల్ ఏజెంట్లను నియమించా లన్నారు. సభలు, సమావేశాలు నిర్వహణ అనుమతుల కోసం సువిధా యాప్‌లో 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 25 తరువాత ఓటర్లకు బూత్ లెవల్ అధికారుల ద్వారా ఓటర్ స్లిప్పుల పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీం, స్టాటిస్టిక్స్ సర్వేలియన్స్ టీం విడతల వారీగా విధులు నిర్వహిస్తున్నాయని అన్నారు. రాష్ట్ర సరిహద్దు, జిల్లాల సరిహద్దుల వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ జారీకి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సీ విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోలింగ్ కేంద్రాలలో వసతుల కల్పనకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఎన్నికలప్రవర్తన నియమావళి పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఎన్నికల నిర్వహణలో ప్రతీ సమాచారాన్ని రాజకీయ పార్టీలకు అందజేస్తున్నామని తెలిపారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అధికారులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. సమావేశంలో లోకేశ్వర్, రాజకీయ పార్టీల ప్రతినిదులు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మధుకర్, తహసీల్దార్ పలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

- బాధ్యతగా విధులు నిర్వహించాలి

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఎన్నికల విధులు కేటాయించిన నోడల్ అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలి కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, దాసరి వేణు, జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్‌రావులతో కలిసి నోడల్ అధికారులతో ఎన్నికల ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు.

ఆదిలాబాద్‌లో ఆరు నామినేషన్లు దాఖలు

ఆదిలాబాద్, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజక వర్గానికి మంగళవారం ఆరు నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా రిటర్నింగ్ అధికారి రాజార్షిషా తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆత్రంసక్కు మాజీ మంత్రి జోగురామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మితో కలిసి తన తొలి నామినేషన్‌ను దాఖలు చేశారు. ఆ తర్వాత ఎమ్మెల్సీ దండెవిఠల్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు జాన్సన్‌నాయక్, లోలం శ్యాంసుందర్, రాంకిషన్‌రెడ్డి, మర్సుకోల సరస్వతిలతో కలిసి రెండవ నామినేసన్ సెట్‌ను దాఖలు చేశారు. ఇండియా ప్రజాబందు పార్టీ నుంచి గేడంసాగర్ రెండు నామినేషన్ సెట్లను దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా మేస్రం గంగాదేవి రెండవ సెట్ నామినేషన్‌ను దాఖలు చేయగా చౌహాన్‌రాము లోక్‌సభ స్థానానికి నామినేషన్ వేశారు.



టీబీజీకేఎస్‌కు అన్నయ్య రాజీనామా



దీకొండ అన్నయ్య

మంచిర్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్)కు కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు దీకొండ అన్నయ్య మంగళవారం రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖలో తన ఆవేదనను వెలిబుచ్చారు. తాను టీబీజీకేఎస్ కేంద్ర కమిటీలో కొనసాగుతూ, కార్మికుల పక్షాన చేసిన పోరాటాలు చేసినా తనకు యూనియన్‌లో గుర్తింపు లేదన్నారు. ఇటీవల యూనియన్ వేరు, పార్టీ వేరు అనే నినాదంతో యూనియన్‌ను తప్పుదోవ పట్టించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో యూనియన్ పోటీ చేయకపో వడంతో మున్ముందు యూనియన్ కొనసాగుతుందనే ఆశ లేదని, అందుకే ప్రాథమిక సభ్యత్వానికి, కేంద్ర కమిటీ ఉపాధ్య పదవికి రాజీనామా చేస్తున్నట్లు వివరించారు. ఇంతకాలం తనకు సహకరించిన నాయకులకు, కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 23: సింగరేణి ఉద్యోగుల పిల్లలకు(బాలబాలికలు) ఈ నెల 26వ తేదీ నుంచి 25 రోజుల పాటు వివిధ క్రీడాంశాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డీజీఎం(పర్సనల్) పి. అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, నస్పూర్‌లోని సేవాభవన్‌లో వాలీబాల్, ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఫుట్‌బాల్ క్రీడాంశాల్లో ఇచ్చే శిక్షణకు ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఆసక్తి గల బాలబాలికలు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కాగా సింగరేణి ఉద్యోగుల పిల్లలకు వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు అర్హత కలిగిన పిఈటీలు ఈ నెల 25వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో దరఖాస్తు చేసుకోవాలని డీజీఎం (పర్సనల్) పి. అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా క్రీడల్లో అనుభవం కలిగిన పీఈటీలు, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం కలిగిన క్రీడాకారులు శిక్షణ ఇచ్చేందుకు అర్హులని ఆయన పేర్కొన్నారు. 25 రోజుల శిక్షణకు గౌరవ వేతనం అందిస్తామని తెలిపారు.

నేటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

- ఇళ్లకు తరలివెళ్లిన విద్యార్థులు- జూన్12న పునఃప్రారంభం



ఇళ్లకు వెళుతున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 23: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు బుధవారం నుంచి వేసవి సెలవులను ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులను ప్రకటించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున 49 రోజులపాటు వేసవి సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయి. వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ సెలవుల్లో పాఠశాలల్లో తరగతులను నిర్వహించవద్దని, ఎవరైనా పాఠశాలలు ఓపెన్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. జిల్లాలోని అయా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, వసతి గృహల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాల యాజమాన్యాలు పేరెంట్స్ మీటింగ్‌లను నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే విద్యా సంవత్సరంలో అమలు చేయాల్సిన కార్యక్రమాల గురించి చర్చించి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు. విద్యార్థులకు వేసవి సెలవుల్లో చేయాల్సిన అసైన్‌మెంట్, పుస్తక పఠన అంశాలు తల్లిదండ్రులు వేసవి సెలవుల్లో పిల్లల పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలపై వివరించారు.


ఈదురుగాలులు..వర్షం



దహెగాంలో విరిగి పడ్డ విద్యుత్ స్తంభాలు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 23 : జిల్లాలో సోమవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈదురుగాలులతో ఆయా మండలాల్లో చెట్ల కొమ్మలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షానికి మంగళవారం వాతావరణం చల్లబడింది. జిల్లాలో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్న క్రమంలో వర్షం కురియడంతో ఉష్ణోగ్రతలు 39 డిగ్రీలకు తగ్గాయి.

దహెగాం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి అన్నదాతలు ఆందోళనకు గురయ్యారు. కోతకు వచ్చిన వరిపంట నేలకొరిగింది. రైతులు ప్రస్తుతం వరి పంట కోసి ధాన్యాన్ని కల్లాల్లో రాసులు పోశారు. వర్షాని కి ధాన్యం తడిసిపోయింది. పలు చోట్ల రాత్రి వేళ కరెంటు సరఫరా నిలిచిపోయింది. మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో పునరుద్ధరించారు. పెసరికుంట గ్రామంలో ఈదురుగాలు లతో విద్యుత్ స్తంభాలు, పీకలగుండం సమీపంలో చెట్లు విరిగిపడ్డాయి.



ఆసిఫాబాద్‌లో కురుస్తున్న వర్షం

చింతలమానేపల్లి: మండలంలోని సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన తేలిక పాటి వర్షం కురవడంతో వాతావరణం ఒక్క సారిగా చల్లబడింది. దీంతో ప్రజలు ఎండ వేడి నుంచి కాస్త ఉపశమనం పొందారు. గత కొన్ని రోజులుగా ఎండ 42 డిగ్రీలు పైనే ఉండడంతో ఎండవేడికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ప్రత్యేక పూజలు..అభిషేకాలు

- ఘనంగా చిన్న హనుమాన్ జయంతి
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- పలు చోట్ల కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం



కాగజ్‌నగర్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



ఆసిఫాబాద్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 23: జిల్లాలోని పలు ఆలయాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కమిటీల ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు చేప ట్టారు. జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఎమ్మెల్సీ దండె విఠల్ తో పాటు ఎమ్మెల్యే కోవలక్ష్మి, బీజేపీ నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు సరస్వతీ, బాలేశ్వర్‌గౌడ్, వెంకన్న తదితరులు ప్రత్యేక పూజలు ని ర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దర్మపురి వెంకటే శ్వర్, కమిటీ సభ్యులు పిన్న వివేక్, రాధాకృష్ణ, మురళీదర్‌గౌడ్, శ్రీనివాస్, సతీష్, రాజు, మధు, గుండా వెంకన్న, రూర్ నార్ రమేష్‌తో పాటు మహేష్, శ్రీనివాసరావుతో కూడిన పది మంది అర్చకులు హోమం నిర్వహించారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో హనుమాన్ జయంతీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయాల్లో సింధూర పూజ, హోమ కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు వివిద ఆలయాల్లోకి రావడంతో రద్దీ నెలకొంది.. సాయంత్రం హనుమాన్ విగ్రహానికి సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు, జడ్పీ ఇన్‌చార్జీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, సిర్పూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ రావి శ్రీనివాస్ పూజలు చేశారు. రాత్రి ఎనిమిది గంటలకు హనుమాన్ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు చల్లటిపానీయాలను అందజేశారు. జడ్పీ ఇన్‌చార్జీ చైర్మన్ కోనేరు కృష్ణారావు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. కాగా, కౌటాల సీఐ సాదిక్ పాష పలువురు భక్తులపై దురుసగా ప్రవర్తించడంతో చిన్నపాటి వివాదం చోటు చేసుకుంది.

దహెగాం: మండల వ్యాప్తంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో శివకేశవ ఆలయం నుంచి హనుమాన్ శోభాయాత్ర ప్రారంభమైంది. ప్రధాన వీధుల మీదుగా యువకులు నృత్యాలు చేస్తూ పాత దహెగాంలోని హనుమాన్ ఆలయం వరకు చేపట్టారు. పాత దహెగాం హనుమాన్ ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చింతలమానేపల్లి: మండలంలోని కర్జవెల్లి, బాబాసాగర్, చింతల మానేపల్లి, దిందా, గూడెం తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆయా గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో గ్రామస్తులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందుత్వం ఉట్టిపడేలా ప్రత్యేక పూజలు నిర్వహించి పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వాంకిడి: మండలంలోని వివిధ గ్రామాల్లో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆంజనేయ ఆలయాల వద్ద భక్తులు ప్రజలు, ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. మండలంలోని సవ్వతి గ్రామంలో గిరిజనులు హనుమాన్ మందిర్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కెరమెరి: మండల కేంద్రంతో పాటు సావర్‌ఖేడ, గోయగాం, అనార్‌పల్లి గ్రామాల్లో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

సిర్పూర్(యు): మండలంలోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని హనుమాన్ సాయిబాబా ఆలయంలో భక్తులు ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీక్ష తీసుకున్న స్వాములు విరమణ కోసం కొండగట్టుకు బయలుదేరారు.

బెజ్జూరు: మండల వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆ యాగ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలో భజంగ్‌దళ్ ఆద్వర్యంలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. చిన్నసిద్దాపూర్, ఎల్కపల్లి, నాగులువాయి, కృష్ణపల్లి గ్మాఆల మీదుగా ర్యాలీ కొనసాగింది. గ్రామాల్లో భక్తులు అన్నదానం, మజ్జిగ పం పిణీ చేశారు. ఆలయాల్లో హనుమాన్ జెండా ఎగురవేశారు.

పెంచికలపేట: హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఉదయం నుంచి ఆలయాల్లో భక్తుల తాకిడితో కిటకిటలాడాయి. మండల కేంద్రంలోని హనుమాన్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. జైశ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో కాషాయ పతాకాలు రెపరెపల నడుమ నృత్యాలు చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. జడ్పీటీసీ సరిత, రాజన్న దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, కాంగ్రెస్ నాయకులు రావి శ్రీనివాస్, పాల్వాయి సుధాకర్‌రావు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలంలో హనుమాన్ ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టోంకిని సిద్ది హనుమాన్ ఆలయంతో పాటు మండల కేంద్రంలోని హ నుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమి టీ సభ్యులు మహవీర్ లోయా, మారుతి పాల్గొన్నారు.

రెబ్బెన: మండలంలో హనుమాన్ జయంతీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోలేటి టౌన్ షిప్‌లో హనుమాన్ జయంతీని పురస్కరించుకొని శోభాయాత్ర నిర్వహించారు. ఈ యాత్ర పలు వీధుల గుండా సాగింది. ఎస్సై చంద్ర శేఖర్ గట్టి బందోబస్తును నిర్వహించారు.



ఆసిఫాబాద్‌లో పూజలు చేస్తున్న బీజేపీ నాయకుడు నాగేశ్వర్‌రావు



పెంచికలపేటలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



బెజ్జూరులో ర్యాలీ నిర్వహిస్తున్న భజరంగ్‌దళ్ సభ్యులు



రెబ్బెనలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు